## క్లుప్తంగా

### ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

### రోగులకు మందుల పంపిణీ



మహిళలను పరీక్షిస్తున్న వైద్యులు

భీమునిపట్నం: భీమిలిలోని కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి పర్యవేక్షణలో ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 98 మంది రోగులను డాక్టర్ టి.జగన్నాథరావు, టి.జె.మోహన్ పరీక్షించి అవసరమైన మందులు అందించారు. ఫౌండేషన్ ప్రతినిధులు కె.ఎస్.ఎన్.మూర్తి, కె.భానోజీరావు, కె.శ్రీనివాసరావు, సభ్యులు శ్రీనివాసరావు, రాంబాబు, లక్ష్మణరావు, శంకర్, రాము, కిశోర్ పాల్గొన్నారు.


### త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం చేస్తున్న ప్రబోధ సేవా సమితి ప్రతినిధులు

తగరపువలస: త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రబోధ సేవాసమితి, హిందూ జ్ఞాన వేదిక విజయరాంపురం కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం తగరపువలస, బాలాజీనగర్, తాతా థియేటర్ వెనుక ప్రాంతాల్లో ప్రచారం చేశారు. సమితి అధ్యక్షుడు కె.త్రినాథరావు మాట్లాడుతూ జీవుడు నశించి జన్మలు లేకుండా మోక్షం పొందేందుకు శ్రీరామ నామ జపం దోహదపడుతుందన్నారు. వి.భవానీ, కె.లక్ష్మి, కె.బంగారుతల్లి, మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

### శిల్పారామంలో చేనేత ఉత్పత్తుల విక్రయ స్టాల్స్



చేనేత వస్త్రాలు పరిశీలిస్తున్న స్థానికులు

పీఎం పాలెం : శిల్పారామం (జాతర)లో చేనేత హస్తకళల ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయ స్టాల్స్‌ను స్థానిక పరిపాలన అధికారి టి.విశ్వనాథ రెడ్డి ఆదివారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వేసవిలో చేనేత వస్త్రాలు ధరించడం వల్ల ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఈ స్టాల్స్ మే నెల 19 వరకు వినియోగదారులకు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, చేనేత ఉత్పత్తిదారులను ప్రోత్సహించాలని కోరారు. చేనేత వస్త్ర ఉత్పత్తులు కొనుగోలు చేయడానికి వచ్చే సందర్శకులకు శిల్పారామంలోకి ఉచిత ప్రవేశ సదుపాయం కల్పించామని తెలిపారు.



# నేను వ్యాపారిని కాదు... ప్రజా సేవకుడిని

- ఎన్నికలు అయిపోగానే నియోజకవర్గాలు మార్చను
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

కొమ్మాది: రాజకీయాలతో వ్యాపారం చేయడం తనకు రాదని... తాను ప్రజలకు ఎల్లప్పుడూ సేవకుడినే అని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 8వ వార్డు వివేకానందనగర్‌లో వైఎస్సార్ సీపీ నాయకులతో ఆదివారం ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను ఎన్నికలు అయిపోయిన వెంటనే నియోజకవర్గాలు మార్చి ప్రజలను మర్చిపోయే నాయకుడిని కాదన్నారు. గడిచిన ఐదేళ్లలో భీమిలి నియోజకవర్గంలో ఎనలేని అభివృద్ధి జరిగిందని, మరోసారి అవకాశమిస్తే మరింత అభివృద్ధి చేస్తానన్నారు. విశాఖను పరిపాలనా రాజధానిగా ప్రకటించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి అత్యధిక మెజార్టీతో భీమిలి ఎమ్మెల్యేగా తనను గెలిపించి బహుమతిగా ఇద్దామన్నారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, నాయకులు లొడగల రామ్మోహన్, ఉప్పులూరి గోపి, ముదుండి రాజేశ్వరి, అల్లాడ ఉమామహేశ్వరరావు, పార్వతి, దువ్వి వాసు, మాదు బుజ్జి, అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

**భీమిలిని నంబర్ వన్ స్థానంలో నిలుపుతా**

మధురవాడ: భీమిలి నియోజకవర్గాన్ని రాష్ట్రంలో నంబర్ వన్ స్థానంలో నిలపడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 5వ వార్డు శివశక్తినగర్ రోడ్డులోని లక్ష్మి టవర్స్ అపార్ట్‌మెంట్, నగరంపాలెం గ్రామంలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే నియోజకవర్గంలో రూ.2500 కోట్ల విలువ చేసే సంక్షేమ పథకాలు అమలు చేశామని, అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. ఇంకా అభివృద్ధి చేయాల్సి ఉందని, అందుకే మూడోసారి ఇదే నియోజకవర్గం నుంచి ఎన్నికల బరిలో నిలిచానన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయిన తర్వాత విశాఖ పరిపాలన రాజధాని అవుతుందని, తద్వారా ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. భీమిలిలో యువతీ యువకులకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. తాము అవినీతికి ఆస్కారం లేకుండా సేవలు అందించామని, సేవాభావంతోనే రాజకీయాల్లోకి వచ్చామన్నారు. ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, ఆమె భర్త, మంత్రివర్యులు బొత్స సత్యనారాయణ కూడా ఎవరికి ఏ సమస్య వచ్చినా తక్షణమే స్పందించే నాయకులన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని కోరారు.



ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును సత్కరిస్తున్న నాయకులు



ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు హారతిచ్చి స్వాగతం పలుకుతున్న శివశక్తినగర్ రోడ్డులోని లక్ష్మి టవర్స్ అపార్టుమెంట్ వాసులు

**ఓటు హక్కు వినియోగించుకోవాలి**

విద్యావంతులు, అపార్ట్‌మెంట్ల వాసులు వచ్చే నెల 13న జరిగే ఎన్నికల్లో ఖచ్చితంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటు ఎంతో విలువైందని, అంతటి విలువైన ఓటును వృథా చేయవద్దన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, పోతిన సురేష్, నూకవరపు బాబ్జి, సంతోష్, కాశ్మీర్ అప్పారావు, ఉగ్గిన నాగరాజు, నిమ్మకాయల గణేష్, చంద్రశేఖర్, శ్రీనివాస్, సత్యనారాయణ, రామరావు, విశ్వనాథం, జగదీష్, రవితోపాటు నగరంపాలెం గ్రామ పెద్దలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



నగరంపాలెం పెద్దలతో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు

## దుర్గా కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం రేపు



మద్దిలోని దుర్గా కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం

పద్మనాభం: మండలంలోని మద్ది గ్రామంలో గల రామ కోటి ఆశ్రమం అష్టమ, దుర్గా కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం మంగళవారం నిర్వహించనున్నారు. వార్షికోత్సవానికి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా విశేష పంచామృత అభిషేకాలు, కుంకుమార్చన నిర్వహిస్తారు. అనంతరం శ్రీ పరమాత్మానందగిరి స్వామి ప్రవచనాలు చేస్తారు. తదుపరి అన్నదానం నిర్వహించనున్నారు.

## యువతి అదృశ్యం

పీఎం పాలెం : స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువతి అదృశ్యమైంది. సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... ఆనందపురం మండలం గంభీరం పంచాయతీ కిల్లివానిపాలెంలో మీసాల రమణ కుటుంబంతో నివసిస్తున్నాడు. అతని కుమార్తె లీలావతి (19) ఇంటర్ పూర్తి చేసి ఇంటి వద్దనే ఉంటోంది. ఈ నెల 20న నగరంలో షాపింగ్ చేసేందుకు ఇంటి నుంచి వెళ్లి మళ్లీ తిరిగిరాలేదు. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

# వైఎస్సార్ సీపీ శ్రేణుల విస్తృత ప్రచారం



శింగనబందలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస : భీమిలి మండలం శింగనబంద పంచాయతీలో భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, విశాఖ పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మిని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ఆదివారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవడం ద్వారా రాష్ట్రాన్ని సంక్షేమం, అభివృద్ధి బాటలో నడిపించుకోవచ్చని పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, పార్టీ జిల్లా కార్యదర్శి మద్దిల వెంకటరమణ, సీనియర్ నాయకుడు కేపీ సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ అధ్యక్షుడు కాళ్ల సన్యాసిరావు, తాలాడ కాశీ, కాళ్ల శ్రీను, గాడు సన్నిబాబు, కాళ్ల బలరాం, తదితరులు పాల్గొన్నారు.



ఐనాడలో ప్రచారం నిర్వహిస్తున్న మామిడి శివరామకృష్ణ, రామేశ్వరరావు, తదితరులు

**ఐనాడలో ఇంటింటికీ ప్రచారం**

పద్మనాభం: వైఎస్సార్ సీపీ విశాఖపట్నం ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ లక్ష్మిని, భీమునిపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావును ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి గెలిపించాలని ఆ పార్టీ నాయకులు మామిడి శివరామకృష్ణ, కోరాడ రామేశ్వరరావు, కోరాడ పాపారావు మండలంలోని ఐనాడలో ఆదివారం ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గత ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించి... సీఎం జగన్ మరోసారి ముఖ్యమంత్రి అయ్యేందుకు మద్దతివ్వాలని అభ్యర్థించారు. ఈ ప్రచారానికి ఓటర్ల నుంచి అనూహ్య స్పందన లభించింది.

## మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



రేవిడిలో మజ్జిగ చలివేంద్రం ప్రారంభిస్తున్న శ్రీనివాసరెడ్డి, తదితరులు

పద్మనాభం: మండలంలోని రేవిడిలో శ్రీ శ్రీనివాస యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో వెంపాడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వెంపాడ శ్రీనివాసరెడ్డి మజ్జిగ చలివేంద్రం ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో టి.ఎ న్.టి.హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు వాండ్రాసి సతీష్, రిటైర్డ్ ఎంపీడీవో సత్య బాపిరాజు, శ్రీనివాస సేవా సంఘం అధ్యక్షుడు కోన సన్యాసి నాయుడు, ఉపాధ్యక్షుడు పాండ్రంగి సత్యం నాయుడు, తొగరోతు తమ్మునాయుడు పాల్గొన్నారు.

# కోరాడ కోసం ఫ్రీగా తిరిగాం.. 'గంటా'కూ ఫ్రీ అంటే ఎలా..?

డబ్బులు అందక రగిలిపోతున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

తగరపువలస: గంటా శ్రీనివాసరావు భీమిలి నుంచి పోటీ చేస్తే రూ.60 కోట్ల నుంచి రూ.70 కోట్లు ఖర్చు చేస్తారన్న ప్రచారంలో నిజం లేదని తేలిపోయిందని టీడీపీ నాయకులు, కార్యకర్తలు నిట్టూరుస్తున్నారు. గతంలో కోరాడ రాజబాబు అంటే డబ్బులు లేవని, డబ్బులు ఇవ్వకపోయినా సానుభూతితో ఆయన వెంట తిరిగామని... ఇప్పుడు 'గంటా' వెనుక డబ్బులు ఇవ్వకుండా తిరగడం కుదరదని ఘంటాపథంగా చెప్పేస్తున్నారు. ఈ నెల 18న నామినేషన్ వేసిన రోజే చాలా మందికి డబ్బులు ఇస్తామని ఆశ చూపి ఇవ్వలేదని... అలాంటి గంటా వెనుక ప్రచారానికి ఎలా వెళ్తామంటున్నారు. దీంతో నాలుగు రోజులుగా కార్యకర్తలు ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. రూ.2 కోట్ల వంతున మండల స్థాయి నాయకులకు, రూ.5 లక్షల వంతున సర్పంచ్, ఎంపీటీసీ స్థాయి నాయకులకు ఇచ్చి కొనుగోలు చేస్తున్న గంటాకు కార్యకర్తల అవసరాలు కనిపించడం లేదని వాపోతున్నారు. ఇలా అయితే కార్యకర్తల నుంచి గంటాకు గట్టి ఎదురుదెబ్బ తప్పదని టీడీపీ కార్యకర్తలే జోస్యం చెబుతున్నారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలకు విలువ లేనందున ఈ ఎన్నికలు పూర్తయిన తర్వాత గంటా మూటాముల్లె సర్దుకోక తప్పదని అంటున్నారు. అసలు గంటా శ్రీనివాసరావుకు నియోజకవర్గంలో చాలా వరకు పంచాయతీ, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలెవరూ తెలియదని అంటున్నారు.

వారి పేర్లు కూడా తెలియని గంటా... ప్రతి ఒక్కరినీ చూసి నవ్వుతాడని, అది చూసి మురిసిపోయే కొందరు నాయకులు తమ పేరు తెలియకపోయినా డబ్బులు మాత్రం ఖచ్చితంగా ఇవ్వాలని గొణుక్కుంటున్నారు. గంటా తన అనుకూల మీడియాలో చేసుకుంటున్నంత ప్రచారం వాస్తవంలో లేదని అంటున్నారు. గంటా ఇదే పంథాలో కొనసాగితే ఓటర్లంతా సంక్షేమ పథకాలకు ముచ్చటపడి చాపకింద నీరులా వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టడం ఖాయమని టీడీపీ నాయకులు, కార్యకర్తలే అంటున్నారు.

# వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు



వైఎస్సార్ సీపీలో చేరిన మాజీ సైనికులతో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నాయకులు



బోయివీధి మత్స్యకారులను వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

- సీఎం జగన్ పాలనలో లక్షలాది మందికి మేలు
- ఎవరెన్ని కుట్రలు పన్నినా మళ్లీ జగనే ముఖ్యమంత్రి
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



కారుషెడ్ జంక్షన్ వద్ద పార్టీలో చేరినవారితో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నాయకులు

భీమునిపట్నం: గత ఐదేళ్ల పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించారని, ఫలితంగా లక్షలాది మందికి మేలు జరిగిందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. లబ్ధిదారులంతా సీఎం జగన్ చేపట్టిన బస్సు యాత్రకు తండోపతండాలుగా తరలివచ్చి తమ కృతజ్ఞతను తెలియజేసుకుంటున్నారన్నారు. ప్రజలంతా పోలింగ్ రోజు కోసం ఎదురు చూస్తున్నారని, ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి సీఎం జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సిద్ధంగా వున్నారని పేర్కొన్నారు. భీమిలిలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. ముందుగా మాజీ సైనికుల సంక్షేమ సంఘానికి చెందిన కొయ్య గురయ్యరెడ్డి ఆధ్వర్యంలో 350 మంది పార్టీలో చేరగా వారికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ మరోసారి ముఖ్యమంత్రి అవుతారని, ఆ విషయంలో ఎటువంటి సందేహమూ లేదన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా, కుతంత్రాలు పన్నినా వైఎస్సార్ సీపీ గెలుపును ఆపలేరన్నారు. మళ్లీ మన ప్రభుత్వం అధికారంలోకి రావడం, సీఎం జగన్ ముఖ్యమంత్రిగా విశాఖ నగరంలో ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమన్నారు. విశాఖ పరిపాలన రాజధాని అయితే ఈ ప్రాంతం ఎంతగానో అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యనిర్వాహక సభ్యులు, పాడేరు నియోజకవర్గ పార్టీ ఎన్నికల పరిశీలకులు కాకర్లపూడి శ్రీకాంత్ రాజు పాల్గొన్నారు.

**బోయివీధి నుంచి 150 కుటుంబాలు..**

స్థానిక మత్స్యకారులు నివసించే బోయివీధి నుంచి 150 మంది టీడీపీ సానుభూతిపరుల కుటుంబాలు మత్స్యకార నాయకురాలు చీకటి ఊర్మిళ, వైఎస్సార్ సీపీ నాయకులు కదిరి ఎల్లాజీ, మైలిపల్లి షణ్ముఖరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో మంచి పనులు చేశారని, ఆ విషయాన్ని అందరూ గుర్తించుకుని ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. మత్స్యకార నాయకురాలు ఊర్మిళ మాట్లాడుతూ ప్రజలందరికీ ఎంతో మంచి చేస్తున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు గెలుపు కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. ఇదే సందర్భంగా స్థానిక బీచ్ ఫొటోగ్రాఫర్లు 40 మంది వైఎస్సార్ సీపీలో చేరారు.

**జీవీఎంసీ 2వ వార్డు నుంచి...**

జీవీఎంసీ 2వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఎస్.కరుణాకరరెడ్డి, వార్డు అధ్యక్షుడు భాస్కరరెడ్డి, జీరు వెంకటరెడ్డి సహకారంతో నమ్మివానిపేట నుంచి మాధవ్, దినేష్ ఆధ్వర్యంలో 30 మంది, సంతపేట నుంచి చేట్ల కొత్తయ్యరెడ్డి, ఉప్పాడ నాని ఆధ్వర్యంలో 30 మంది తెలుగుదేశం, జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలోకి ఎమ్మెల్యే ముత్తంశెట్టి సమక్షంలో చేరారు. అందరూ వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి సహకరించాలని ఎమ్మెల్యే కోరారు.



వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ, జనసేన నాయకులతో ఎమ్మెల్యే శ్రీనివాసరావు

**వైఎస్సార్ సీపీలో యువకులు చేరిక**

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు స్వతంత్రనగర్, వాంబేకాలనీకి చెందిన 60 మంది యువకులు ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. కారుషెడ్డు జంక్షన్ వద్ద గల పార్టీ ఎన్నికల కార్యాలయంలో ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి గెలుపు కోసం పనిచేస్తామని తెలిపారు.

## భారతీయ సంస్కృతి మహోన్నతమైనది



ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

దాబాగార్డెన్స్ : భారతదేశ సంస్కృతి మహోన్నతమైనదని రామకృష్ణా మిషన్ స్వామి గుణేషానంద పేర్కొన్నారు. రామకృష్ణామిషన్, భారత్ వికాస్ పరిషత్ విశాఖ ప్రాంత్, భారత్ వికాస్ పరిషత్ విశాఖ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ బిల్డింగ్‌లో ఆదివారం భారత్ వికాస్ పరిషత్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ సందర్భంగా గుణేషానంద మాట్లాడుతూ భారతీయులుగా జన్మించడం మన పూర్వజన్మ సుకృతమన్నారు. సంస్కృతి, సాంప్రదాయాలకు భారతదేశం నిలయమన్నారు. ప్రతి విద్యార్థి విద్యతో పాటు దేశభక్తి అలవరచుకోవాలని సూచించారు. స్వామి వివేకానంద ఆశయాలతో భారత్ వికాస్ పరిషత్ స్థాపించడం గొప్ప విషయమన్నారు. బీవీపీ ప్రాంత అధ్యక్షుడు వంకాయల సన్యాసిరాజు నేతృత్వంలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. 2024–25 ఏడాదికి విశాఖపట్నం ప్రాంత్ అధ్యక్షుడిగా వంకాయల సన్యాసిరాజు, కార్యదర్శిగా జీబీవీ సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా టి. సాయికృష్ణ ఎన్నిక కాగా, బీవీపీ విశాఖ శాఖ అధ్యక్షుడిగా సీహెచ్‌వీ సత్యనారాయణ, కార్యదర్శిగా పి.భాస్కరరావు, కోశాధికారిగా జీఎస్‌వీ మాణిక్యాలరావు ఎన్నికయ్యారు. విశాఖపట్నం బీవీపీ ఝాన్సీ లక్ష్మీభాయి నారీశాఖకి అధ్యక్షురాలిగా న్యాయవాది పి. షర్మిల, కార్యదర్శిగా డాక్టర్ సీహెచ్ నిర్మల, కోశాధికారిగా వి. భువనసుందరి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రాజన్ వలయ్తాన్, రమేష్ చంద్‌జైన్, పురుషోత్తమశాస్త్రి, ఎంవీవీ సత్యనారాయణ, ఎంవీ రాజశేఖర్, ఎస్. గోపాలరావు, పి. వెంకటేశ్వరరావు, ఆంజనేయ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా సంస్కృత భారతి జానపద సమ్మేళనం

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్‌లోని బీవీకే కళాశాలలో ఆదివారం విశాఖ సంస్కృత భారతి జానపద సమ్మేళనం ఘనంగా జరిగింది. జిల్లాలో సంస్కృత భాష అభిమానులు సుమారు 300 మంది వరకు పాల్గొనడంతో ఈ సమ్మేళనం ఉదయం నుంచి సాయంత్రం వరకు వేడుకగా సాగింది. సంస్కృత విజ్ఞాన ప్రదర్శన, వస్తు ప్రదర్శన, పుస్తక ప్రదర్శన, రసాయనాలు లేని ఆయుర్వేద వనమూలికల నుంచి తీసి అద్దిన రంగులతో తయారు చేసిన వస్త్రాలు ఆకట్టుకున్నాయి. కళాకారులు సంస్కృత భాషలో హాస్య నాటికలు, నృత్యాలు, గీతాలతో అలరించారు. ఈ సందర్భంగా సంస్కృత భారతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ సుందర్‌రాజ పెరుమాళ్ మాట్లాడారు. గాయత్రి విద్యా పరిషత్ కార్యదర్శి పి.సోమరాజు, మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్. మాధవ్, భాగవతుల శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న ప్రముఖులు

## సర్వజన మనోరంజని వాహనంపై సింహాచలేశుడు

సింహాచలం: సింహగిరిపై నిర్వహిస్తున్న వరాహ లక్ష్మీనృసింహ స్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం స్వామి వారికి సర్వజన మనోరంజని వాహనంపై తిరువీధి నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వేణుగోపాల స్వామిగా అలంకరించి శ్రీదేవి, భూదేవిలను సర్వజన మనోరంజనిపై అధిష్ఠం పజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాస మూర్తి పాల్గొన్నారు. కల్యాణోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు సోమవారం సాయంత్రం సూర్యప్రభ వాహనంపై తిరువీధి నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.



నృత్యప్రదర్శనలో కళాకారులు